


WWW.EPAPER.MAHAADAILY.COM
మహా పత్రిక
ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం
15-08-2025 | శుక్రవారం





నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడం

# మనందరి బాధ్యత

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ప్రజలను ఒప్పించి అభివృద్ధి పనులను పూర్తి చేయాలి
- ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 2వ డివిజన్ పాండురంగాపురంలో స్టార్మ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల


వివరాలు 5లో




మావోయిస్టు పార్టీకి చెందిన

## 6 గురు దళ సభ్యుల లొంగుబాటు

03









# భారీ వర్షా ల వల్ల ప్రాణ నష్టం, ఆస్తి నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు

## మంత్రులు పొంగులేటి, తుమ్మల

## సీఎస్ తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ల తో సమీక్ష







**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 14 (మహా) :** రాష్ట్ర వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అంతటా అప్రమత్తంగా ఉండాలని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రులు ఆయా జిల్లాల కలెక్టర్ లు, పోలీస్ కమిషనర్ లు, ఎస్పీల తో వరద పరిస్థితులపై సమీక్ష జరిపారు. భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తున్నందున ఎక్కడ కూడా ప్రాణ నష్టం, ఆస్తి నష్టం సంభవించకుండా, అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగానే అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రులు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయక చర్యలు చేపట్టేందుకు వీలుగా అన్ని జిల్లాలకు ప్రత్యేకంగా రూ. కోటి చొప్పున నిధులు కేటాయించడం జరిగిందన్నారు. అవసరమైన చోట ఈ నిధులను వెచ్చించాలని, ఇంకనూ అవసరమైతే నిధులు కేటాయిస్తామని, నిధుల సమస్య ఎంతమాత్రం లేదని స్పష్టం చేశారు. గడచిన మూడు రోజుల్లో కొన్ని ప్రాంతాల్లో ఊహించిన దానికంటే ఎక్కువ, మరికొన్ని ప్రాంతాల్లో తక్కువ వర్షపాతం నమోదైందని వీటిని దృష్టిలో పెట్టుకొని వచ్చే రోజుల్లో తగిన జాగ్రత్చలు తీసుకోవాలన్నారు. సహాయక చర్యలు పర్యవేక్షించేందుకుగాను ఉమ్మడి పది జిల్లాలకు సీనియర్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించడం జరిగిందని తెలిపారు. సెలవులో ఉన్న అధికారులు, సిబ్బంది సెలవులను రద్దు చేసి వెనక్కు పిలిపించాలని, వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ప్రాంతాలలో చేపట్టవలసిన రక్షణ చర్యల గురించి ఆదేశాలు జారీ చేశారు. రైల్వే లైన్లు, లోలెవెల్ బ్రిడ్జీలు, కాజ్‌వేలు, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి వర్షం నీరు నిల్వకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యంగా లోలెవెల్ బ్రిడ్జీల దగ్గర పోలీసు సిబ్బందిని నియమించాలని సూచించారు. అంటువ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని, అలాగే త్రాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

చిన్న చిన్న వర్షాలు 200 మిల్లీమీటర్లకే బ్యాక్ వాటర్ వల్ల అక్కడున్న ప్రజలను తరలించవలసి వస్తుందని దీనికి శాశ్వత పరిష్కారం కోసం అక్కడున్నవారిని తరలించి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కలెక్టర్లకు సూచించారు. వర్షాలకు విద్యుత్ వైర్లు తెగిపోయినట్లైతే, తక్షణమే విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని, రోడ్లు తెగిపోయిన చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా ట్రాఫిక్ అంతరాయం లేకుండా, సాధారణ జన జీవనానికి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు. పారిశుధ్యం, తాగునీటి సరఫరా పై ప్రత్యేక దృష్టి సారించాలని, తాగునీరు కలుషితం కాకుండా పర్యవేక్షణ చేయాలన్నారు. వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అన్ని శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో పని చేస్తూ భారీ వర్ష పరిస్థితిని సమర్ధవంతంగా ఎదుర్కోవాలని సూచించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఐ డి ఓ సి కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ .. జిల్లాలో సాధారణ స్థాయిలోనే వర్షపాతం నమోదవుతున్నప్పటికీ, చంద్రుగొండ మండలం మద్దుకూరు గ్రామం లో గరిష్టంగా 125 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనదని తెలిపారు. అయినప్పటికీ ఎటువంటి పంట నష్టం, ఆస్తి నష్టం లేదా వరద ప్రభావం ఇప్పటివరకు సంభవించలేదని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో ఇరిగేషన్ మరియు వ్యవసాయ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారని తెలిపారు, ప్రతి గంటకు పరిస్థితిని సమీక్షిస్తున్నారని కలెక్టర్ తెలిపారు. అత్యవసర పరిస్థితులు తలెత్తినపుడు తక్షణ స్పందన కోసం జిల్లాలో విస్తృత ఏర్పాట్లు చేశామని వివరించారు.

భద్రాచలంలో ఎన్‌డిఆర్ఎఫ్ బృందం...

జిల్లాలో భద్రాచలంలో ఎన్‌డిఆర్ఎఫ్ బృందం, పాల్వంచలో ఎస్‌టిఆర్ఎఫ్ బృందం, అలాగే కొత్తగూడెం డివిజన్ పరిధిలోని చాతకొండ పోలీస్ బెటాలియంలో 100 మంది శిక్షణ పొందిన సిబ్బంది సిద్ధంగా ఉన్నారని చెప్పారు. వరంగల్ లో వచ్చిన వరదలకు ప్రజలకు సహాయం అందించేందుకుగాను పాల్వంచ ఎస్డిఆర్ఎఫ్ బృందం పంపించామని తెలిపారు. అదేవిధంగా రోపులు, లైఫ్ జాకెట్లు, టార్చ్ లైట్లు, హ్యాండ్ మైకులు వంటి అత్యవసర పరికరాలు జిల్లా మరియు మండల కేంద్రాల్లో అందుబాటులో ఉంచినట్లు వివరించారు. ఫైర్ శాఖ వద్ద 2 బోట్లు, పోలీస్ శాఖ వద్ద 5 బోట్లు - మొత్తం 7 బోట్లు జిల్లాలో మోహరించబడి ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఎటువంటి విపత్తు పరిస్థితులు తలెత్తినా జిల్లా పరిపాలనా యంత్రాంగం సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని కలెక్టర్ వివరించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్, ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మ, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, సి పి ఓ సంజీవరావు, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, ఓ ఎస్ డి వెంకటరమణ మరియు ఏవో అనంత రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సహకార సంఘాల ఎన్నికల వాయిదా

- సహకార కమిటీలకు పదవీకాల పొడిగింపు
- పిఎసిఎస్, డిసిసిబి, టిజిసిఎబి కమిటీలు యథాతథం
- అమల్లోకి వచ్చిన కొత్త ఉత్తర్వులు

**ఖమ్మం, మహా :** తెలంగాణ సహకార రంగం నడిపే ప్రధాన పాలక కమిటీల పదవీకాలం పొడిగిస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్నికలు నిర్వహించకుండా ప్రస్తుత పర్సన్-ఇన్-ఛార్జ్ కమిటీలను కొనసాగిస్తూ, పనితీరులో లోపాలున్నా లేదా చట్టపరమైన ఉల్లంఘనలు చేసినా, వాటిని తొలగించి కొత్త వ్యక్తులను నియమించే అధికారం రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీస్‌కు అప్పగించింది. పరిపాలనా పునర్వ్యవస్థీకరణ పూర్తి కాలేదనే కారణంతో తీసుకున్న ఈ నిర్ణయం, స్థానిక రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపే అవకాశం ఉందనే అంచనా నిపుణులది. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు , జిల్లా సహకార కేంద్ర బ్యాంకులు అలాగే తెలంగాణ రాష్ట్ర సహకార వ్యవసాయ అభివృద్ధి బ్యాంకు ల ప్రస్తుత పాలక కమిటీల పదవీకాలాన్ని తదుపరి ఆదేశాలు వెలువడే వరకు పొడిగించింది. ఈ మేరకు వ్యవసాయ-సహకార శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. రఘునందన్‌రావు గో.ఆర్.టి. నెం. 386ను జారీ చేశారు. ఈ నిర్ణయం తెలంగాణ కో-ఆపరేటివ్ సొసైటీస్ చట్టం, 1964లోని సెక్షన్ 32(7)(a) ప్రకారం అమల్లోకి వచ్చింది. ప్రభుత్వం ఈ చర్యకు రెండు ప్రధాన కారణాలను ప్రస్తావించింది. మొదటిది, రాష్ట్రంలో ఇటీవల జరిగిన రెవెన్యూ మండలాలు, జిల్లాల పునర్విభజన ప్రక్రియ ఇంకా పూర్తికాలేదు. ఈ పునర్వ్యవస్థీకరణ పూర్తయ్యాకే సహకార సంఘాల పరిధి సరిచేసి, ఎన్నికల ప్రక్రియ ప్రారంభించవచ్చని అధికారులు స్పష్టం చేస్తున్నారు. రెండవది, సహకార సంఘాల ఎన్నికలు స్థానిక రాజకీయాల్లో కీలక పాత్ర పోషించే దృష్ట్యా, ప్రస్తుత కమిటీలను కొనసాగించడం ద్వారా పరిపాలనా నియంత్రణను ప్రభుత్వం తన చేతుల్లో ఉంచుకోవచ్చని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఉత్తర్వుల ప్రకారం ప్రస్తుతం ఉన్న పర్సన్-ఇన్-ఛార్జ్ కమిటీలు యథాతథంగా కొనసాగుతాయి. అయితే పనితీరు సరిగా లేకపోయినా, చట్టపరమైన నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా లేదా అనర్హత తలెత్తినా, ఆయా కమిటీలను రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీస్ తక్షణమే తొలగించి, కొత్త పర్సన్-ఇన్-ఛార్జ్‌లను నియమించవచ్చు. పీఐసీలు సంఘ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని చట్టం, నియమావళి, బై-లాజ్‌ల ప్రకారం నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టంగా ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ నిర్ణయం వల్ల సహకార రంగంలో తాత్కాలిక స్థిరత్వం నెలకొనే అవకాశం ఉన్నప్పటికీ, ఎన్నికల వాయిదా కారణంగా కొత్తగా ఎన్నుకోబడిన కమిటీల ప్రవేశం ఆలస్యం కానుంది. దీని ప్రభావంగా అభివృద్ధి, ఆర్థిక నిర్ణయాలు మందగించే అవకాశం ఉందని రంగ నిపుణులు సూచిస్తున్నారు. మరోవైపు, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకోబడిన కమిటీలకే పూర్తి అధికారముండాలనే వాదన నేపథ్యంలో, సభ్యుల అసంతృప్తి పెరిగే అవకాశం ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. మొత్తానికి, పరిపాలనా పునర్విభజన పూర్తయ్యే వరకు పర్సన్-ఇన్-ఛార్జ్ వ్యవస్థ కొనసాగనుంది. కానీ రాజకీయ కోణంలో ఈ పొడిగింపు, సహకార రంగంపై ప్రభుత్వ పట్టు బిగించడానికే మార్గం సుగమం చేస్తుందని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇది ఎన్నికల సమీకరణాలను, స్థానిక రాజకీయ సమతుల్యతను ప్రభావితం చేసే అంశంగా మలచుకునే అవకాశాన్ని కూడా అందిస్తోంది.

### తిరంగా ర్యాలీతో
# దేశభక్తి సందేశం
## మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ఖమ్మం, మహా :** భారత స్వాతంత్ర్య అమృత మహోత్సవాల వేడుకలలో భాగంగా, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం స్థానిక ఎఫ్‌సిఐ గోదాంపై సమీపంలో నుండి తిరంగా ర్యాలీను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, "తిరంగం మన జాతీయ గౌరవం, ఐక్యతకు ప్రతీక. ప్రతి పౌరుడు జెండాను గౌరవించడం మాత్రమే కాకుండా, దేశ అభివృద్ధికి తన వంతు కృషి చేయాలి" అని పిలుపునిచ్చారు. ర్యాలీకి విద్యార్థులు, యువజన సంఘాలు, మహిళా సంఘాలు, రైతు ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై దేశభక్తి నినాదాలతో మార్మోగించారు. ఎఫ్‌సిఐ గోదాంపై నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని ప్రధాన రహదారుల మీదుగా సాగి, ప్రజల్లో స్వాతంత్ర్య స్ఫూర్తిని నింపింది. పాల్గొన్న వారు చేతుల్లో జాతీయ పతాకాలు పట్టుకొని "వందే మాతరం", "జై హింద్" వంటి నినాదాలతో వాతావరణాన్ని ఉత్సాహభరితంగా మార్చారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికార వర్గాలు, సామాజిక సంస్థల ప్రతినిధులు ర్యాలీలో నడుచుకుంటూ ప్రజలతో మమేకమయ్యారు. ఈ కార్యక్రమం సజావుగా జరిగేలా పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు.



### మావోయిస్టు పార్టీకి చెందిన
# 6 గురు దళ సభ్యుల లొంగుబాటు
## జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

**భద్రాద్రి కొత్తగూడెం ఆగస్టు 14 (మహ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు మరియు 81 మరియు 141 సి ఆర్ పి ఎఫ్ బెటాలియన్ అధికారులు ఆదివాసి ప్రజల అభివృద్ధి, సంక్షేమం కొరకు నిర్వహిస్తున్న “ ఆపరేషన్ చేయూత" కార్యక్రమం ద్వారా లొంగిపోయిన సభ్యులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరియు పోలీసు శాఖ కల్పిస్తున్న సదుపాయల గురించి తెలుసుకుని, నక్సలిజాన్ని విడనాడి ఇక పై తాము కూడా కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంతమైన జీవితం గడపాలని నిర్ణయించుకొని వివిధ స్థాయిలలో పనిచేస్తున్న (06) మంది నిషేదిత మావోయిస్టు పార్టీకి చెందిన పి పి సి ఎం /ఎసిఎం 01, పార్టీ సభ్యులు 02, మిలీషియా సభ్యులు 03, వచ్చి జనజీవన స్రవంతిలో కలిసినట్లు జిల్లా ఎస్పీ బిరుదురాజు రోహిత్ రాజు గురువారం మీడియాకు వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోఈ సంవత్సరం జనవరి2025 నుండి ఇప్పటివరకు వీరితో కలిపి 306 మంది మావోయిస్టు దళసభ్యులు వివిధ హోదాలలో అనగా డి వి సి ఎం ఎస్ 04, ఏసిఎం20, పార్టీ సభ్యులు39, మలేషియా సభ్యులు110, ఆర్పీసీ సభ్యులు35, డీఏకేఎంఎస్ కే ఏ ఎం ఎస్47, సి ఎన్ ఎం సభ్యులు30, జి ఆర్ డి సభ్యులు21 జనజీవన స్రవంతిలో కలిసి తగిన పునరావాస సౌకర్యాలను పొందడం జరిగిందని ఎస్పీ తెలిపారు. క్షీణదశలో ఉన్న మావోయిస్టు పార్టీ భవిష్యత్తును చూసి, క్రిందిస్థాయి క్యాడర్లు పై స్థాయి క్యాడర్ల ఆదేశాలను వ్యతిరేకించి, రహస్య ఉద్యమ జీవితం నుండి బయటకు వచ్చి తమ, తమ గ్రామాలకు వెళ్లి కుటుంబాలతో కలిసి ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని కోరుకుంటున్నారు. అందులో భాగంగానే ఈ సంవత్సరం ఇప్పటి వరకు 306 మంది సాయుధ దళ సభ్యులు కేవలం ఒక్క భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనే జనజీవన స్రవంతిలో కలిసి తమ కుటుంబాలతో శాంతియుత జీవనం గడుపుతున్నారు. అడవుల్లో ఉన్న ఆదివాసి గ్రామాల ప్రజలు మావోయిస్టు పార్టీకి సహకరించకపోవడం వలన చివరికి ఆహార పదార్థాలు కూడా లభించకపోవడంతో అన్ని స్థాయిల్లో ఉన్న క్యాడర్ల ఆరోగ్యం క్షీణించిందని, ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతంకు నడిచి వెళ్లే శక్తి కూడా లేదని తెలుస్తుంది. 90 శాతానికి పైగా క్యాడర్లు నిరుపేద ఆదివాసీలు, తమ కుటుంబ అభివృద్ధి ముఖ్యమని తలచి పార్టీని వీడి జనజీవన స్రవంతి లో కలుస్తున్నారు. ఇది చాలా శుభపరిణామమని ఎస్పీ వ్యాఖ్యానించారు. గురువారం లొంగిపోయిన (06) మంది మావోయిస్టు దళ సభ్యులకు తక్షణ సహాయంగా ప్రతి ఒక్కరికి 25 వేల రూపాయల చొప్పున మొత్తం నగదు ఒక లక్ష 50 వేల రూపాయలు పంపిణీ చేశామని, అనంతరం వారి ర్యాంకుల వారిగా మిగతా నగదును, ఆధార్ కార్డులు మరియు బ్యాంక్ అకౌంట్స్ వచ్చిన తర్వాత వారి బ్యాంకు ఖాతాలలో మిగతా మొత్తం ను చెక్కుల రూపంలో జమ వేయబడుతుందని ఎస్పీ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఆదివాసీల అభివృద్ధి, సంక్షేమం పట్ల ఎంతో సానుకూలంగా స్పందిస్తుందని, పోలీసు శాఖ కూడా తన వంతు కృషి చేస్తుందని, కర్రె గుట్టలలో గల అటవీ సంపదను రక్షించడానికి ఆ సంపదను ఆదివాసీలు స్వేచ్ఛగా ఉపయోగించుకోవడానికి కావలసిన పోలీసు క్యాంపులను కేంద్ర బలగాలు ఏర్పాటు చేయబోతున్నాయని ఎస్పీ తెలిపారు. అభివృద్ధితో కూడిన ప్రజల శాంతియుత జీవనం పోలీసుల నినాదమని, ఆదివాసీ ప్రజలకు ఎస్పీ రోహిత్ రాజ్ విజ్ఞప్తి చేశారు.



# మొక్కలు నాటటమే కాదు... వాటికి సంరక్షించాలి

**నేలకొండపల్లి, ఆగస్టు 14 మహా:** మొక్కలను నాటటమే కాకుండా వాటిని సంరక్షించాలని ఎంపీడీఓ యం.యర్రయ్య సూచించారు. మండలం లోని సింగారెడ్డిపాలెం, నేలకొండపల్లి పంచాయతీలో అవెన్యూ ప్లాంటేషన్ పనులను గురువారం పరిశీలించారు. .ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. అన్ని పంచాయతీలో అవెన్యూ ప్లాంటేషన్ లో భాగంగా మొక్కలు నాటే విధంగా కార్యచరణ ను రూపొందిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా ప్రతీ పంచాయతీలో అవెన్యూ ప్లాంటేషన్ పనులు వెంటనే ప్రారంభించాలని సూచించారు. నిర్లక్ష్యం చేస్తే



సహించేది లేదని హెచ్చరించారు. ప్రతీ పంచాయతీ పచ్చటి తోరణాలు మాదిరిగానే రహదారికి ఇరువైపులా మొక్కలు నాటాలని సూచించారు. నర్సరీలో మొక్కలు సంరక్షణ బాధ్యత గా తీసుకోవాలని అన్నారు. ప్రతీ మొక్క కు లెక్క ఖచ్చితంగా ఉండాలని సూచించారు. జిల్లాలో మండలం ఆదర్శంగా ఉండేలా మొక్కల పెంపకం చేపట్టాలని సూచించారు. ప్రతీ పంచాయతీ కి ఇచ్చిన లక్ష్యం ను నెరవేర్చాలని సూచించారు. నేలకొండపల్లి మండలం కు ఇచ్చిన టార్గెట్ 70 వేల మొక్కలను నాటాలని సూచించారు. వాటిలో 15 వేల అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు, 7,100 మొక్కలు రీప్లేస్మెంట్ మొక్కలను నాటాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి శివ. ఈజీఎస్ ఏపీవో ఆర్.సునీత, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, ఈసీ శేషగిరి రావు, టెక్నికల్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన తుంబురి దయాకర్



**కూసుమంచి, మహా:** కూసుమంచి మండలంలోని హట్య తండాలో బాదావత్ వీరన్న నీల కుమారుడి రిసెప్షన్ కార్యక్రమాన్ని కూసుమంచి విజయ రామ ఫంక్షన్ హాల్ లో గురువారం నిర్వహించిన కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఖమ్మం క్యాంపు కార్యాలయ ఇంచార్జ్ తుంబురు దయాకర్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జొన్నలగడ్డ రవికుమార్, కూసుమంచి మాజీ ఎంపీపీ జూకూరి గోపాలరావు, మండల కాంగ్రెస్ నాయకులు మాదాసు ఉపేందర్ రావు, మోదుగు వీరభద్రం, చాట్ల పరుశురాం, కొండ మైపాల్, గుండా దామోదర్ రెడ్డి, చెన్నా మోహన్, బాదావత్ నరేష్, భారీ వీరభద్రం, జనార్ధన్ గౌడ్, మల్లికార్జున్ గౌడ్, బానోతు రవి, కందునూరి లక్ష్మీనారాయణ, ఏడుకొండలు, గుగులోతు లచ్చు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వెంటపడొద్దన్నందుకు.. విచక్షణా రహితంగా దాడి



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 14 (మహా):** బంధువుల అమ్మాయి వెంట పడొద్దన్నందుకు యువకుడిపై అల్లరి మూక దాడికి తెగబడింది. నడిరోడ్డు మీద పిడుగుద్దులతో విచక్షణారహితంగా దాడి చేశారు. పాల్వంచ వికలాంగుల కాలనీ కి చెందిన నరేష్ అనే ఎలక్ట్రీషియన్ గురువారం పని నిమిత్తం పాల్వంచ అంబేద్కర్ సెంటర్ నుండి వెళ్తున్న సమయంలో ముందుగానే ప్రణాళిక వేసుకుని దమ్మపేట సెంటర్ కి చెందిన యువకులు మాటు వేసి విచక్షణ రహితంగా నరేష్ పై దాడి చేశారు.సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని దాడి చేస్తున్న యువకులను అదుపు చేసేందుకు ప్రయత్నించినప్పటికీ, ఒక దశలో పోలీసులను కూడా నెట్టివేసి నరేష్ పై దాడి చేసేందుకు ప్రయత్నించారు. మొత్తానికి పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చి దాడి చేసిన యువకులను పోలీస్ స్టేషన్ కు తరలించారు. దాడి చేసిన యువకులు మత్తులో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ దాడిలో నరేష్ తలపై తీవ్ర గాయం అయింది. చికిత్స నిమిత్తం నరేష్ ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఇటువంటి ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకోవాలని పాల్వంచ ప్రజలు కోరుకుంటున్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించిన అధికారులు



**కూసుమంచి, మహా:** కూసుమంచి మండలం లింగారంతండాలో నూతనంగా నిర్మాణం చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లను గృహనిర్మాణ శాఖ ఏఈ రవి, పంచాయతీ కార్యదర్శి జంగాల అశోక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బానోతు రవి నాయక్ పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేస్తున్నారా లేదా కొలతలు వేసి పరిశీలించారు. ఈ సందర్భంగా హౌసింగ్ ఏఈ రవి కుమార్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని, పూర్తి చేస్తున్న లబ్ధిదారులకు విడతల వారీగా నిధులు జమ చేయడం జరుగుతుందన్నారు.

## సింగరేణి అధికారుల వేతనాల పి.ఆర్.పి లో జాప్యం తగదు





**సత్తుపల్లి, ఆగస్టు 14: మహా.** మండల పరిధిలోని జలగం వెంగళరావు ఉపరితల గని సింగరేణి అధికారులు నిరసన బాట పట్టారు. కొంతకాలంగా అధికారుల గృహాలకు ఉచిత కరెంట్ బిల్లులు, ఐ.ఐ.టి/ఐ.ఐ.ఎం ఫీజు రీయింబర్స్మెంట్ వర్తింపు, దీర్ఘకాలికంగా నిలిచిపోయిన ఉద్యోగస్తుల పదోన్నతులు సంస్థ ఇవ్వవలసిన పలు బకాయులపై సింగరేణి అధికారుల సంఘం ఇచ్చిన పిలుపుమేరకు నల్ల బ్యాడ్జీలు ధరించి మూడు రోజులుగా నిరసన బాట పట్టారు. సింగరేణి సంస్థ సత్వరమే తమ డిమాండ్లను పరిశీలించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## కూసుమంచి సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని సందర్శించిన తుంబూరు దయాకర్ రెడ్డి



**కూసుమంచి, మహా:** మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఖమ్మం క్యాంపు కార్యాలయం ఇన్చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి గురువారం కూసుమంచి సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని సందర్శించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి రిజిస్ట్రేషన్ ఎలా జరుగుతున్నాయి సబ్ రిజిస్ట్రార్ ను అడిగి తెలుసుకున్నారు. రోజుకు ఎన్ని రిజిస్ట్రేషన్లు అవుతున్నాయి, ప్రజలు ఏవిధంగా స్పందిస్తున్నారో దయాకర్ రెడ్డి సబ్ రిజిస్ట్రార్ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన స్థానికులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నాగరాజు , కాంగ్రెస్ పార్టీ నాయకులు జొన్నలగడ్డ రవికుమార్, జూకూరి గోపాలరావు, మాదాసు ఉపేందర్, చాట్ల పరుశురాం, చెన్నా మోహన్, బారీ వీరభద్రం, అర్వపల్లి జనార్ధన్, గుండా దామోదర్ రెడ్డి పాల్గొన్నారు.






# ఘనంగా ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు



**జూలూరుపాడు, ఆగస్టు 14, (మహా) :** మండల కేంద్రంలోని సెయింట్ ఆంటోనీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో గురువారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు చిన్ని కృష్ణుడు, రాధా, గోపికల వేషధారణలతో పాఠశాల ఆవరణాన్ని బృందావనంగా మలచి చిలిపి, అల్లరి శాష్టలతో పాఠశాలలో సందడి చేశారు. పిల్లల వేషధారణ చూపరులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ సిస్టర్ ఆర్తి, కరస్పాండెంట్ సిస్టర్ సౌమ్య లు మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతోపాటు, మన సంస్కృతి, సాంప్రదాయాలు పండుగలు, దేవతామూర్తులు, వారి చరిత్ర తదితర విషయాల గురించి తెలియజేయడంతో పాటు, అవగాహన కల్పించడం, ప్రత్యక్షంగా వారితోనే ప్రదర్శన చేపిస్తూ, ఆధ్యాత్మికంపై అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. భవిష్యత్ లో కూడా చదువుతోపాటు, క్రమశిక్షణ, ఆటలు, పాటలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. శ్రీకృష్ణ అష్టమి వేడుకలు పాఠశాలలో విజయవంతం కావడానికి సహకరించిన స్కూల్ టీచర్స్, పిల్లల తల్లిదండ్రులకు వారు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

# యూరియ కొరత తీర్చండి

## సొసైటీ చైర్మన్ కి వినతి పత్రం అందజేసిన లాకావత్ గిరిబాబు



**జూలూరుపాడు, ఆగస్టు14, (మహా) :** మండల వ్యాప్తంగా రైతులు యూరియ కొరతతో నానా ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే యూరియ కొరతను తీర్చాలని బిఆర్ఎస్ నాయకులు లాకావత్ గిరిబాబు కోరారు. గురువారం మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో చైర్మన్ చీమలపాటి బిక్షం, సీఈవో రమణారెడ్డికి యూరియా కొరత తీర్చాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ.. పది ఏళ్లలో లేని యూరియా కొరత ఇప్పుడు ఎట్లా వచ్చిందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కెసిఆర్ ప్రభుత్వంలో యూరియ కోసం రైతులు పడిగాపులు కాసే పరిస్థితి రాలేదని, సకాలంలో రైతులకు పెట్టుబడి సహాయం అందించిన ఘనత కెసిఆర్ కే దక్కిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సకాలంలో పెట్టుబడి సహాయం అందక, ఎరువుల కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎద్దేవాచేశారు. రైతులు మందు కట్టల కోసం క్యూ కట్టాల్సిన పరిస్థితి రావడం సిగ్గుచేటన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం యూరియ కొరతను తీర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ చాపలమడుగు రామ్మూర్తి, లకావత్ హేమ్లా, భూక్యా సేవా తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతమైన నగరంగా ఖమ్మం అభివృద్ధి

- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు
- ఖమ్మం 36వ డివిజన్ లో స్టార్మ్ వాటర్ డ్రైన్, సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల





**ఖమ్మం, మహా :** ప్రశాంతమైన నగరంగా ఖమ్మంను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టామని రాష్ట్రవ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. మంత్రివర్యులు, ఖమ్మం 36వ డివిజన్ గాంధీ చౌక్ లో గురువారం 2 కోట్ల 25 లక్షలతో చేపట్టిన స్టార్మ్ వాటర్ డ్రైన్, సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ నగరంలో ప్రజలందరూ కలిసికట్టుగా ప్రశాంతంగా బ్రతకాలని గాంధీ చౌక్ వ్యాపారస్తులు ఎన్నికల సమయంలో కోరుకున్నారని, ప్రస్తుతం ప్రశాంతమైన ఖమ్మం నగరం అభివృద్ధి దిశగా పయనిస్తుందని అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కారణమైన తల్లి సోనియాగాంధీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను, సంక్షేమ పథకాలను రాష్ట్ర ముఖ్యమంత్రి ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ అమలు చేస్తున్నారని అన్నారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని రైతుల శ్రేయస్సుకు, రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. రోడ్లు వెడల్పు చేసుకుంటే అభివృద్ధి సాధ్యం అవుతుందని, మన పరిసరాలను మనం పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మొక్కలను పెంచి గ్రీనరీ పెంపుకు చర్యలు తీసుకోవాలని మంత్రి అన్నారు. *ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం ఖమ్మం నగరంలో అవసరమైన రోడ్లు, డ్రైన్ల అభివృద్ధి పనులు చేపట్టామని అన్నారు. మంత్రి ప్రత్యేక చొరవ వల్ల ఖమ్మం ఖిల్లాకు రోప్ వే మంజూరు అయ్యిందని, ఖానాపురం ఊర చెరువు నుంచి అల్లిపురం వరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు జరుగుతున్నాయని అన్నారు. ఖమ్మం నగర ప్రజలు ఆహ్లాదకరంగా గడిపేందుకు వీలుగా వెలుగు మట్ల అర్బన్ పార్క్ అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. 155 కోట్లతో మోడల్ మార్కెట్ అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. ప్రజల అంగీకారంతో రోడ్ల విస్తరణ పనులు చేపట్టామని అన్నారు. రైతాంగం బాగుంటే వ్యాపారాలు బాగా జరుగుతాయని అన్నారు. నగర అభివృద్ధి ఆకాంక్షించే మంత్రి తుమ్మలకు ప్రజలు సంపూర్ణంగా సహకరించాలని మేయర్ తెలిపారు. అనంతరం మర్చెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంత్రిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంత రావు, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ రంజిత్, ఖమ్మం ఆర్డీఓ నరసింహా రావు, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సైదులు, కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆన్ లైన్ ర్యాండమైజేషన్ ద్వారా..

# డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపు

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- కంప్యూటర్ ర్యాండమైజేషన్ ద్వారా పారదర్శకంగా 40 ఇండ్ల కేటాయింపు పూర్తి
- పింజర మడుగు, ముచ్చర్ల ప్రాంతాల్లోని లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కంప్యూటర్ ర్యాండమైజేషన్ ద్వారా అలాట్ చేసిన జిల్లా కలెక్టర్





**ఖమ్మం, మహా.** లబ్ధిదారులకు ఆన్ లైన్ ర్యాండమైజేషన్ ద్వారా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పారదర్శకంగా కేటాయించామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో గురువారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ తో కలిసి కామేపల్లి మండలం పింజరమడుగు, ముచ్చర్ల ప్రాంతాల్లోని లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కంప్యూటర్ ర్యాండమైజేషన్ ద్వారా అలాట్ చేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ పింజరమడుగు, ముచ్చర్ల ప్రాంతాల్లో నిర్మించి చాలా రోజులుగా పెండింగ్ ఉన్న 40 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కంప్యూటర్ ర్యాండమైజేషన్ ద్వారా అలాట్ చేయడం జరిగిందని అన్నారు. నేడు జరిగిన అలాట్ మెంట్ వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. కంప్యూటర్ ర్యాండమైజేషన్ ద్వారా అలాట్ చేసిన ఇండ్ల పట్టాలను త్వరలో స్థానిక ఎమ్మెల్యే, మంత్రుల చేతుల మీదుగా పంపిణీ చేస్తామని అన్నారు. పింజరమడుగు గ్రామంలో నిర్మించిన 20 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను, ముచ్చర్ల గ్రామంలో నిర్మించిన 20 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు గతంలోనే లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేశామని అన్నారు. ప్రస్తుతం ఎంపిక చేసిన లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపు జరుగుతుందని, ఏ లబ్ధిదారుడికి ఏ నెంబర్ ఇండ్లు కేటాయించాలనే అంశం పూర్తి పారదర్శకంగా ఎటువంటి పైరవీలు లేకుండా ఆన్ లైన్ ద్వారా కేటాయించామని అన్నారు. ఈ సమావేశంలో కామేపల్లి తహసీల్దార్ సుధాకర్, పింజరమడుగు, ముచ్చర్ల డబుల్ బెడ్ రూం లబ్ధిదారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# నీట మునిగిన పంట పొలాలు

**పొంగిపొర్లుతున్న చెరువులు, వాగులు, కుంటలు అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు అధికారులు హితవు**






**ముదిగొండ, ఆగస్టు 14 మహా:** గత మూడు రోజుల నుండి మండలంలో కురిసిన భారీ వర్షాలకు చెరువులు,వాగులు,కుంటలు నిండి గురువారం పొంగిపొర్లుతూ అలుగులు పారుతున్నాయి. మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న చెరువులు వాన వరదకు పూర్తిస్థాయిలో నిండి,ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.ముదిగొండ,వల్లభి,బాణాపురం, గోకినేపల్లి,మేడేపల్లి ప్రధాన రహదారిలాపై నుండి పొర్లి లోతట్టు ప్రాంతాలుతోపాటు ,పంట పొలాలు నీట మునిగాయి. దీంతో ప్రయాణికులు, వాహనదారులు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.మండల అధికారులు జలమయమైన లోతట్టు ప్రాంతాలతోపాటు,ఉధృతంగా ప్రవహించే వాగులను పర్యవేక్షిస్తూ సీఐ వడ్డేపల్లి మురళి వాగుల వద్ద ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి ప్రజలను,ప్రయాణికులను వాగులను దాటించారు. సురక్షిత ప్రాంతాల్లోనే ప్రజలు ఉండాలని,వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు ప్రజలు అవసరమైతే తప్ప బయటకి రావద్దని సీఐ వడ్డేపల్లి మురళి,తాహశీల్దార్ కొక్కుల సునీత ఎలిజిబెత్ సూచించారు. మరో మూడు రోజులు వర్షాలు ఉన్నందున ప్రజలు,ప్రయాణికులు పనులను వాయిదా వేసుకోవాలని,వాగులు, కుంటలు,చెరువుల వద్దకు చేపల వేటకు వెళ్లరాదని,తడిచేతులతో విద్యుత్తు పరికరాలు ముట్టుకోవద్దని వారు ప్రజలను కోరారు.

# అనిల్ అంతిమయాత్రలో పాల్గొన్నవారికి ధన్యవాదాలు - కుటుంబ సభ్యులు



**కారేపల్లి, మహా :** ఆర్మీ జవాన్ బానోత్ అనిల్ నాయక్ అంత్యక్రియల్లో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి అనిల్ కుటుంబ సభ్యులు,సోదరుడు బానోతు ప్రసాద్ ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు.అంతిమ యాత్రను విజయవంతం చేసే క్రమంలో అనిల్ పార్థివదేహానికి ఘన స్వాగతం పలికిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థిని,విద్యార్థులకు,బోధనా సిబ్బందికి,జూనియర్ కళాశాల విద్యార్థినీ,విద్యార్థులకు అధ్యాపకులకు,ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యానికి విద్యార్థినీ,విద్యార్థులతోపాటు ఎమ్మెల్యేలు,మాజీ ఎమ్మెల్యేలు వివిధ రాజకీయ పార్టీ నాయకులకు,మండల అధికారులకు,పోలీస్ శాఖాధికారులకు,ప్రింట్ అండ్ ఎలెక్ట్రానిక్ మీడియా మిత్రులకు,వివిధ వ్యాపార వేత్తలకు ప్రతి ఒక్కరికి అనిల్ కుటుంబం తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు సోదరుడు ప్రసాద్ తెలిపాడు. కుటుంబ సభ్యుడిని కోల్పోయి దుఃఖంలో ఉన్న తమ కుటుంబానికి అండగా నిలబడి,అనిల్ ప్రాణత్యాగానికి సంఘీభావం తెలిపిన తీరును ఎప్పటికీ మరువలేమని తెలిపారు.

# ఘనంగా ప్రెస్‌క్లబ్ కమిటీ ప్రమాణ స్వీకారం

- హాజరైన టియూడబ్ల్యూజె రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ
- జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేయాలని పిలుపు







**ఖమ్మం, మహా :** ఖమ్మం ప్రెస్‌క్లబ్ కమిటీ ప్రమాణ స్వీకారం, బాధ్యతల స్వీకరణ గురువారం ఘనంగా జరిగింది. ఖమ్మంలోని ప్రెస్‌క్లబ్‌లో అధ్యక్షులు నామా పురుషోత్తం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి టియూడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. దేవాలయం లాంటి ప్రెస్‌క్లబ్‌ను అందరికీ ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలన్నారు. ప్రెస్‌క్లబ్ కమిటీ చేపట్టబోయే కార్యకలాపాలకు యూనియన్ అండదండలు అందచేస్తుందన్నారు. ప్రెస్‌క్లబ్ సభ్యత్వం, భవిష్యత్ కార్యక్రమాల గురించి దిశానిర్దేశం చేశారు. టియూడబ్ల్యూజె(ఐజెయు) యూనియన్ జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రెస్‌క్లబ్ కమిటీ ఆదర్శవంతంగా పని చేయాలన్నారు. జాతీయ కౌన్సిల్ సభ్యులు నలజాల వెంకట్రావ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాటేటి వేణుగోపాల్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సామినేని మురారి, జిల్లా కార్యదర్శి మైసా పాపారావు, రాష్ట్ర నాయకులు వనం వెంకటేశ్వర్లు, స్తంభాద్రి హౌజింగ్ సొసైటీ అధ్యక్షులు కనకం సైదులు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు భూపాల్, మహేందర్, నగర అధ్యక్షులు చెరుకుపల్లి శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి పసుపులేటి సత్యనారాయణ, నగర కోశాధికారి ఏలూరి వేణుగోపాల్, ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి శీలం శ్రీనివాస్, జర్నలిస్టులు రమేష్ తదితరులు పాల్గొన్నారు. ప్రెస్‌క్లబ్ కోశాధికారి కళ్యాణ్ చక్రవర్తి వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

**ప్రెస్‌క్లబ్ కార్యవర్గం ఇదే :**

ఉపాధ్యక్షులుగా మారబోయిన శ్రీనివాస్(ఖమ్మం టివి), మల్లిఖార్జున్(ఆంధ్రప్రభ), ఎనిగండ్ల శ్రీనం(సూర్య), జి.రామారావు(ప్రెస్‌మీడియా), శివాజీ(భద్రాద్రి న్యూస్) ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా జుజ్జూరి ఉపేందర్(సాక్షి), ఇంద్రసేన(ప్రజాపక్షం), గోసు నాగేశ్వరరావు(ఫాస్ట్ న్యూస్), బుర్రి శ్రీనివాసరావు(పయనీర్), బిజ్జాల భాస్కర్(మనప్రజాప్రతినిధి) ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లుగా నాగేశ్వరరావు(విజన్ ఆంధ్రా), టి.అశోక్ (యువగళం), మందా వెంకటేశ్వర్లు (పోరాటగళం) ఎన్నికయ్యారు.

# కూసుమంచి మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎస్ ఐ నాగరాజు



**కూసుమంచి, మహా:** రాబోయే రెండు మూడు రోజుల భారీ వర్షాలు వస్తాయనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో కూసుమంచి మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కూసుమంచి సబ్ ఇన్స్పెక్టర్ నాగరాజు గురువారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ప్రజల భద్రత దృశ్య 24 గంటలు అధికారులు, మా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ప్రకటనలో తెలిపారు. ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పొంగిపొర్లనున్న వాగులు, వంకలు వద్దకు వెళ్లవద్దు. జలాశయాలు, చెరువులు, కుంటలు చూడడానికి వెళ్లకూడదు – ప్రమాదానికి గురయ్యే అవకాశముంది. కావున అట్టి ప్రదేశాలకు ప్రజలు ఎవరు కూడా వెళ్లకూడదు. వ్యవసాయ పనుల నిమిత్తం పొలాలకు వెళ్లే రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పొలాల్లో పడిపోయిన విద్యుత్తు తీగలతో ప్రమాదం కలిగే అవకాశం ఉన్నందున రైతులు చాలా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. పురాతన కట్టడాలు లేదా పురాతనమైన ఇండ్లు పురాతనమైన గోడలు ఉన్నట్లయితే వర్షతాకిడికి నాని కింద పడే అవకాశాలు ఉన్నాయి కావున ప్రజలు అప్రమత్తంగా ఉండవలెను.ఎక్కడైనా వరద ఉధృతి తలెత్తిన సందర్భంలో మన పోలీసు సిబ్బంది, అధికారులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టి ప్రాణ నష్టం లేకుండా చూడాలని అధికారులకు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. రెవెన్యూ , వ్యవసాయం , గ్రామీణాభివృద్ధి , పశుసంవర్ధక , ప్రజా రవాణా, నీటిపారుదల వంటి అన్ని విభాగాలతో సరైన సమన్వయం చేసుకోవాలి అని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగింది. అత్యవసర సమయంలో డయల్ 100 (లేదా) పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్:+91 87126 59133(లేదా ) సంబంధిత పోలీస్ స్టేషన్ ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.